## Vandemataram Foundation

తాను పుట్టిన ఊరు పచ్చగా ఉండాలి... తాను చదువుకునే బడి బాగుండాలి అని కోరుకునే మనిషి అతను. సంకల్పం మంచిదైతే లక్ష్యాన్ని సాధించే శక్తి సమకూరుతుందని నమ్మి నిరూపించిన సోషల్ సోల్జర్ రవీందర్.

వరంగల్ జిల్లా ఇల్లందలో పేద రైతు కటుంబంలో జన్మించిన రవీందర్ పుట్టిన ఊరిలోనే పదవతరగతి పూర్తిచేశారు. వర్ధన్నపేటలో ఇంటర్ చదివే రోజుల్లో తన కాలేజి మౌలిక వసతులకోసం కలెక్టర్‌ను కలిసి.. 40 లక్షల రూపాయల నిధులు సాధించిన విద్యార్థి రవీందర్. దాంతో ఆ కాలేజీకి సైన్స్‌ల్యాబ్‌తో పాటు ప్రాథమిక సౌకర్యాలు సమకూరాయి. నేడు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని 22 ఏళ్ల క్రితమే తన సొంత గ్రామంలో ప్రారంభించారు రవీందర్. చదువుకునేరోజుల్లో చైత్యన్య యూత్ అసోసియేషన్ ప్రారంభించి ఊరి చెరువులో పూడిక తీయించారు. జిల్లా కలెక్టర్, నాబార్డ్ అధికారులతో మాట్లాడి రైతులకు ఆరు కోట్ల రుణాలు మంజూరు చేయించి... ఏడాదిలో మూడు పంటలు సాగయ్యేందుకు సాయపడ్డారు.

ఎన్ని చేసిన రవీందర్‌కు ఎక్కడో అసంతృప్తి. పూర్తిగా సమాజసేవకు అంకితమవ్వాలన్న భావనతో... ఉన్న కొద్దిపాటి భూమిని అమ్మేసి 2005 లో హైదరాబాద్ వచ్చేశారు. ఎన్నో రాత్రులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గడిపారు. ఎంతోమంది సామాజికవేత్తలను కలిశారు. ఆ స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా 2006లో వందేమాతరం ఫౌండేషన్ ప్రారంభించారు.

వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతుల కల్పనకు, మెరుగైన విద్యను అందించేందుకు కృషిచేస్తున్నారు రవీందర్. అనాథ పిల్లలకు అన్నీ తానవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించేందుకు ఉద్యమం జరగాలని అకాంక్షించే రవీందర్... ప్రభుత్వ స్కూళ్లన్నింటినీ గురుకులాలుగా మార్చాలంటారు. అందరూ సమానమని చెప్పాల్సిన విద్య... సమాజాన్ని వర్గాలుగా విభజించడంలో భాగమైనందుకు ఆవేదన వ్యక్తం చేస్తారాయన. పాఠశాల పునాదుల మీదనే సమాజం నిలబడుతుందని నమ్మి... ప్రతి బడిని చదువుల గుడిగా మార్చేందుకు కృషిచేస్తున్న వందేమాతరం ఫౌండేషన్ రవీందర్‌ను... సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ 2016- ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డుతో సత్కరిస్తోంది.